ప్రజాశక్తి

శనివారం 5 ఆగస్టు 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

టిడిపి శ్రేణులపై దాడి

ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ

- వైసిపి దురాగతాలు పరాకాష్టకు చేరాయి
- పుంగనూరులో దాడిని ఖండించిన టిడిపి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

పుంగనూరులో టీడీపీ శ్రేణులపై వైసీపీ రాళ్ల దాడి ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, ఒంగోలు మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పుంగనూరులో మాజీ ముఖ్యమంత్రి అధినేత నారా చంద్రబాబు పర్యటన అడ్డుకోవడం, టిడిపి శ్రేణులపై వైసిపి కార్యకర్తలు దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. టిడిపి శ్రేణులపై వైసీపీ దాడులకు తెగబడుతున్నా.. పోలీసులు నిరోధించకపోవడం దారుణమన్నారు. దాడులకు పాల్పడిన వైసీపీ మూకలను వదిలి టిడిపి శ్రేణులపై లారీఛార్జి చేయడం అధికారం పార్టీకి వత్తాసు పలకడానికి నిదర్శనమన్నారు. దాడి చేస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం సిగ్గుచేటన్నారు. దాడికి పాల్పడిన 3లో

తడి అందక.. రైతుల కంటతడి

- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం
- ఎండిపోయే దశలో మిర్చి నారుమళ్లు



తూర్పు తక్కెళ్ళపాడు దగ్గర సాగు చేసిన మిర్చి నారుమళ్లు



తడి లేకపోవటం వల్ల నెర్రెలిస్తున్న మిర్చి నారుమళ్ల పొలం

ప్రజాశక్తి-పంగులూరు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా లక్షలాది రూపాయలు పెట్టుబడులుగా పెట్టి మిర్చి నారుమళ్లు సాగు చేసిన రైతులు విలవిలలాడుతున్నారు. సకాలంలో విద్యుత్ సరఫరా చేయకపోవడం వల్ల, నీటి తడి అందక మిర్చి నారు ప్రారంభంలోనే ఎండిపోయే దశకు వస్తోంది. మొలక దశలోనే నారుమళ్లు ఎండిపోయి రైతుల శ్రమ వృథా అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మండల కేంద్రమైన పంగులూరు నుండి తూర్పు తక్కెళ్ళపాడు వెళ్లే రోడ్డులో తూర్పు తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన 55 మంది రైతులు, ఎకరా 20 సెంట్ల భూమిలో మిర్చి నారు సాగు చేశారు. వీరంతా చిన్న, సన్నకారు రైతులే.. వారం రోజుల క్రితం భూమిని చదును చేసి.. చిన్నచిన్న నారుమడులుగా తయారుచేసి.. అందులో మిర్చి హైబ్రిడ్ విత్తనాలు ఎద పెట్టారు. తేజ, బెడిగ విత్తనాలను కిలో 80 వేల రూపాయలు చొప్పున కొనుగోలు చేసి.. సుమారు 25 లక్షల రూపాయలు విలువచేసే విత్తనాలను ఎద పెట్టారు. ఎకరా 20 సెంట్ల భూమిని, 260 చిన్నచిన్న మడులుగా తయారుచేసి విత్తనాలు చల్లారు. అయితే వారం రోజులు క్రితం పెట్టిన విత్తనాలు ఇప్పుడు మొలకలు వస్తున్నాయి. ఈ మొలకలు వచ్చే తరుణంలో నీటి తడి లేకపోవడం వల్ల, పైకి వచ్చిన మొలకలు ఎండిపోవడం, కొత్తగా వచ్చే మొలకలు పైకి రాలేకపోవటం జరుగుతోంది. నాలుగు రోజులుగా కరెంటు లేకపోవడం వల్ల నారుమళ్ళకు నీటి తడి ఇవ్వలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారు మళ్లు ఎండిపోతున్నాయని, నీటి తడి కోసం కరెంటు ఇవ్వాలని 2లో



బ్యాంకు వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతులు

రుణాలివ్వాలని బ్యాంకుకు తాళం వేసి నిరసన

4లో



గడపగడపకూ.. వెళుతున్న మంత్రి సురేష్

అందరికీ సంక్షేమమే జగనన్న లక్ష్యం

5లో

తడి అందక..రైతుల కంటతడి

(మొదటిపేజీ తరువాయి)

విద్యుత్ అధికారులను ఎంత వేడుకున్నా.. వాళ్ళు కనికరించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమల్లెను రావినూతల సబ్ స్టేషన్ పరిధిలోనిదని, రావినూతల ఫీడర్లో రావినూతల, కుర్రవానిపాలెం, తక్కెళ్ళపాడు గ్రామాలు ఉన్నాయని.. రావినూతల, కుర్రవానిపాలెం గ్రామాలకు ఎప్పుడూ ఇబ్బంది ఉండదని, తక్కెళ్ళపాడు లైన్‌లోని జంపర్లు మాత్రమే తొలగిస్తున్నారని రైతులు ఆరోపించారు. తొమ్మిది గంటలు విద్యుత్తు సరఫరా చేయాల్సిన అధికారులు తమ గోడు పట్టించుకోవటం లేదని రైతులు చెబుతున్నారు. పంగులూరు విద్యుత్ ఏఈ వీరాంజనేయులును అడిగితే.. మీ గ్రామానికి హెల్పర్ లేదని, ఇన్‌ఛార్జిని పెట్టామని సాకులు చెబుతున్నారని రైతులు చెప్పారు. ఈ విషయమై ఏఈ వీరాంజనేయులును 'ప్రజాశక్తి' ప్రశ్నించగా రైతులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు.

మా గోడు పట్టించుకోవడం లేదు: పూసల ప్రసాద్, రైతు

ఒక్కో రైతు 45 వేల నుంచి 50 వేల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టి నారు మళ్ళు సాగు చేశాం. విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదేమని అడిగితే మీ గ్రామానికి లైన్‌మెన్ లేడని, ఇన్‌ఛార్జిని పెట్టామని ఏఈ సాకులు చెబుతున్నాడు.

మొక్కల ధర బాగా పెరిగింది: షేక్ మస్తాన్‌వలి, రైతు

నర్సరీలలో ఈ సంవత్సరం మిర్చి మొక్కల రేటు విపరీతంగా పెరిగిపోయింది. ఒక్కో మొక్క మూడు రూపాయల నుంచి మూడున్నర రూపాయల వరకు ధర పలుకుతోంది. మేమంతా చిన్న, సన్నకారు రైతులం. అంత రేటుకు మిర్చి మొక్కలను కొనలేక సొంతంగా నారుమళ్ల పోసుకున్నాం. అధికారులు విద్యుత్తు అందిస్తే నారుమళ్లకు ఇబ్బంది లేదు.

విద్యుత్ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలి
రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్

విద్యుత్ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి రైతులకు పంటలను కాపాడుకునేందుకు సకాలంలో విద్యుత్తును ఇవ్వాలని రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాయని వినోద్‌బాబు డిమాండ్ చేశారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులుగా పెట్టి.. రైతులు మిర్చి నారుమళ్ల సాగు చేసుకుంటే విద్యుత్ సరఫరా లేక ఆ నారుమళ్లు ఎండిపోయే దశకు వచ్చాయన్నారు. అధికారులు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మొలకలు ఎండిపోతున్నాయి: మిరియాల ప్రసాద్, రైతు

నారు మొలకలు వచ్చే దశలో నీటితడి ఇవ్వలేకపోవడం వలన వచ్చిన మొలకలు కూడా ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.

ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చ

(మొదటిపేజీ తరువాయి)

వైసిపి అల్లరి మూకలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలపై నిరసన తెలిపే హక్కును సైతం వైసిపీ హరిస్తోందన్నారు. రాష్ట్రంలో టిడిపికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి వైసిపీ నేతలు బెంబేలెత్తుతున్నారని అన్నారు. టీడీపీ జెండాను చూస్తేనే వైసీపీ నేతలకు వణుకు మొదలైందన్నారు. బరితెగించి దాడికి పాల్పడుతున్నవారు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వ అక్రమాలు, అఘాయిత్యాలు, దురాగతాలు పరాకాష్టకు చేరాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడమంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. రాష్ట్రంలో భయానక వాతావరణ సృష్టించడం కోసం వైసిపీ కుట్రలు చేస్తోందన్నారు. పుంగనూరులో పోలీసులు అధికార పార్టీ కనుసన్నల్లో పనిచేస్తున్నారని ఇది ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని అన్నారు. జెడ్ ప్లస్ కేటగిరి భద్రత కలిగిన చంద్రబాబును రోడ్డుపై పోలీసులు లారీని అడ్డంపెట్టి ఆపడం సరికాదన్నారు. దీనిపై గవర్నర్, డిజిపి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుద్ఘాతంతో యువ రైతు మృతి

పొలంలో తీగలు సరిచేస్తుండగా ఘటన ● ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

ప్రజాశక్తి-పొదిలి

మండలంలో విద్యుత్ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యానికి ఒక యువరైతు బలైపోయిన సంఘటన శుక్రవారం అన్నవరం గ్రామంలో జరిగింది. ఈ గ్రామానికి చెందిన యువ రైతు బూచిరాజు చిరంజీవి(33) తన పొలంలో విద్యుత్ మోటారు నీరు పెట్టేందుకు వెళ్లి అక్కడ ఉన్న సపోర్టింగ్ తీగలు సరిచేస్తుండగా అవి తక్కువ ఎత్తులో ఉన్న మెయిన్ లైనుకు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఒక్కసారిగా ఘాతానికి గురైన చిరంజీవి కేకలు వేస్తూ కిందపడి పోయాడు. సమీప రైతులు అక్కడకు చేరుకుని కిందపడి పోయిన చిరంజీవిని వెంటనే వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్ఐ కె మల్లికార్జున సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా చిరంజీవి పొలంలో ప్రధాన లైన్ విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్న విషయం గ్రామ హెల్పర్‌కు ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్తులు తెలిపారు. ఐదారు నెలలుగా ఈ విషయాన్ని హెల్పర్‌కు, లైన్‌మెన్‌కు మండల ఏఇలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామానికి చెందిన వైసిపి, టిడిపి నాయకులు ప్రజాశక్తికి తెలిపారు. హెల్పర్ రఫీ గ్రామ సమస్యలపై ఏమి చెప్పినా పట్టించుకోవడంలేదని, గట్టిగా మాట్లాడితే నవ్వుతూ వెళ్లిపోతున్నాడని గ్రామస్తులు తెలిపారు. ఇతను మద్యం మత్తులో గ్రామంలో విధులు సక్రమంగా నిర్వహించడం లేదని అధికార పార్టీ నాయకుడు ఒకరు వివరించారు. ఇది కేవలం విద్యుత్ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యమంటూ గ్రామస్తులు మూకుమ్మడిగా ఆరోపిస్తున్నారు. కాగా మండలంలో నెల రోజుల్లో ఇది రెండోది. గత నెల 15వ తేదీన మండలంలోని కంభాలపాడు గ్రామపొలాల్లో ఏఎల్‌ఎంగా పని చేస్తున్న అలవల వెంకటనారాయణ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో అధికారుల నిర్లక్ష్యంపై మంత్రి ఆదిమూలపు సురేష్‌కు సిబ్బంది ఫిర్యాదు చేసినా వారిలో ఎటువంటి మార్పు లేదు. విద్యుత్ శాఖలో అడుగడుగునా అవినీతి, అక్రమాలతో సిబ్బంది ఇష్టారాజ్యం గా వ్యవహరిస్తున్నారని ఇటీవల 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో పలుగ్రామాలలో రైతులు, ప్రజలు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నా ఉపయోగం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.



మృతి చెందిన చిరంజీవి

బైకు బోల్తాపడి వైద్యుడికి గాయాలు

ప్రజాశక్తి-కొండపి

కుక్కను ఢీకొని బైకు బోల్తా పడగా ఓ వైద్యుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం కొండపిలోని మద్దులూరు రోడ్డులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. జరుగుమల్లి మండలం కామేపల్లి పిహెచ్‌సిలో జనరల్ వైద్యులుగా పనిచేస్తున్న డాక్టర్ నాగరాజు తన స్వగ్రామం అయిన చీమకుర్తి నుంచి కామేపల్లికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. కొండపిలోని బిసి హాస్టల్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా అడ్డువచ్చిన కుక్కను ఢీకొట్టడంతో బండి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డాక్టర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థాని కులు వెంటనే ఆయనను కారులో కొండపి సిహెచ్‌సికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఒంగోలు సంఘమిత్రకు తరలించారు.



గాయపడిన డాక్టర్ నాగరాజు

క్రైమ్ కాలమ్



అనూష మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కందులూరు ఘటనలో.. చికిత్స పొందుతున్న మహిళ మృతి

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని కందులూరు గ్రామంలో ఇటీవల కుటుంబ కలహాల నేపథ్యంలో ఎలుకల మందు తిని చికిత్స పొందుతున్న అంబటి అనూష(27) శుక్రవారం మృతి చెందింది. ఈ నేపథ్యంలో సింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, టంగుటూరు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషాలు అనూష చికిత్స పొందుతున్న గుంటూరు జిజిహెచ్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. కుటుంబ కలహాలతో అనూష ఎలుకల మందు తినడమే కాకుండా పిల్లలకు కూడా తినిపించడంతో అనూష కుమార్తె అక్షయ(8 నెలలు) అప్పుడే మృతి చెందింది. తల్లి అనూష కూడా శుక్రవారం మృతి చెందడంతో కందులూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనపై సింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, టంగుటూరు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని సందర్శించిన వారిలో తహశీల్దారు కొల్లిబోయిన సంజీవరావు, విఆర్ఓలు కృష్ణ కిషోర్, చింతపల్లి కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

బైకు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలోని చట్లమిట్ట గ్రామం వద్ద కర్నూలు- గుంటూరు రహదారిపై రోడ్డు దాటుతుండగా మోటార్ సైకిల్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. చట్లమిట్టకు చెందిన కందుల నాసర్‌రెడ్డి(55) దోర్నాల మండలం పెద్దబొమ్మ లాపురం వద్ద ఉన్న తన కుమార్తె వద్దకు వెళ్లి తిరిగి చట్లమిట్టకు చేరుకున్నాడు. అయితే రోడ్డు దాటే క్రమంలో కర్రోల గ్రామానికి చెందిన వ్యక్తి మోటార్ సైకిల్ ఢీకొన డంతో నాసర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతు డికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.



మృతి చెందిన నాసర్‌రెడ్డి

ఉరివేసుకుని మహిళ మృతి

ప్రజాశక్తి-పొదిలి: మండలంలోని ఏలూరు గ్రామంలో ఒక వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కె మల్లికార్జున తెలిపారు. గ్రామానికి చెందిన చిన్నపురెడ్డి అనూష(28) కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆటో బోల్తా

ప్రజాశక్తి-పెద్దదోర్నాల: దోర్నాల మండలంలోని చిన్న దోర్నాల వద్ద శుక్రవారం ఓ అశోక్ లైలాండ్ నాలుగు చక్రాల ఆటో బోల్తా పడింది. సెంట్రింగ్ కర్రల లోడుతో మార్కాపురం నుంచి దోర్నాల వైపు వెళ్తు వాహనం చిన్న దోర్నాల బ్రిడ్జి సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు. అయితే వాహనంతో పాటు అందులోని సెంట్రింగ్ కర్రలు రోడ్డుపై పడిపోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు వాటిని తొలగించడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది.

త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలి

ప్రజాశక్తి-కొండపి: ప్రభుత్వం నుంచి జగనన్న ఇళ్ల పట్టాలు తీసుకున్నవారు త్వరగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఎంపిడివో రమణమూర్తి లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం నాడు హౌసింగ్‌డే కార్యక్రమం లో భాగంగా కొండపి-1 సచివాలయంలో ఇళ్ల లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ 32 ఇళ్ల స్థలాలలో 10 నిర్మించినట్లు తెలిపారు. మిగిలిన 22 ఇళ్ల స్థలాలలో ఎందుకు నిర్మించు కోవడం లేదని, వాటికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు వారం పది రోజుల్లో ఇళ్ల నిర్మాణం పనులు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ పి భూపతి, పంచాయతీ రాజ్ ఏఈ ప్రసాదు, కరెంటు ఏఈ కుంచాల కోటయ్య, వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మినీ వ్యాన్ ఢీకొని ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-పామూరు

మినీ ఆల్విన్ వ్యాన్ ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన శుక్రవారం గోపాలపురం గ్రామంలో జరిగింది. వివరాలలోకి వెళితే.. గోపాలపురం గ్రామానికి చెందిన కుర్రా హజరత్ అతని కుమారులు హాజీద్, హనీఫ్ ఇద్దరిని బైక్ మీద ఎక్కించుకుని రోడ్డు మీద ఉన్న టిఫిన్ దుకాణం వద్ద నిలుచున్నారు. అదే సమయంలో కనిగిరి నుంచి పామూరుకు వస్తున్న ఆల్విన్ వ్యాన్ డ్రైవరు నిద్రమత్తులో వారి మీదకు దూసుకురావడంతో హనీఫ్, హాజీద్‌లకు తలలకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా హనీఫ్‌కు మెదడు బయట పడింది. హజరత్‌కు చెయ్యి విరిగింది. వీరిని పామూరు ప్రజా వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వెంకటరమణ హాస్పిటల్‌లో చేర్పించారు. హనీఫ్ పరిస్థితి విషమంగా ఉంది. పామూరు ఎస్ఐ సురేష్‌యాదవ్ ఒంగోలుకు క్షతగాతుల వద్ద విచారణ చేపట్టి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కన్నుల పండుగలా గంధ మహెూత్సవం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

మండలం గంగవరంలో వేంచేసిన నౌషహీద్ దర్గా 402వ గంధమహెూత్సవం కన్నుల పండుగలా జరిగింది. వ్యాపారం, ఆరోగ్యం, విద్య, గృహం, వివాహం, ఐశ్వర్యం వంటి పలు రకాల రొట్టెలను భక్తులు పంచుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమానికి వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ హాజరై మాట్లాడారు. గంధమహెూత్సవంలో ఇంకొల్లు సిఐ వి సూర్యనారాయణ, ఎస్సై షేక్ నాయబ్ రసూల్, ఎస్‌బిఐ మెయిన్‌శాఖ మేనేజరు రఫి హాజరయ్యారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు గత రెండు నెల్లుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు జడ వినయ్ కుమార్ మాట్లాడుతూ అక్రమ బదిలీలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, జిల్లా సహాధ్యక్షులు బండి బిక్షాల బాబు, జిల్లా కోశాధికారి ఎం వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి మద్దాల సురేష్, విశ్రాంత ఉపాధ్యాయులు నూతనపాటి కోటేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు వై భాస్కరరావు పాల్గొన్నారు.

సీసీఎల్‌ఏను కలిసిన దళితులు


ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

మంగళగిరిలోని చీఫ్ కమిషనర్ ఆఫ్ సిసిఎల్‌ఏను కూకట్లపల్లి దళితులు కలిశారు. కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాలకు చెందిన దళితులకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్మెంట్, డీకే, భూములను ఆక్రమణదారుల నుండి తిరిగి ఇప్పించాలని కోరారు. ఏడాది కాలంగా మండల, జిల్లా స్థాయి అధికారులకు విన్నవించినా ఫలితం లేదని తెలిపారు. అధికారులు స్పందించడం లేదని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి సహకారంతో సీసీఎల్‌ఏని కలిసి తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు గొల్లపూడి అంజయ్య, వేల్పుల ఏబు, భూ పోరాట కమిటీ నాయకులు తంగిరాల సామేలు పాల్గొన్నారు.ద

ఆర్‌బికె సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఆర్బికే కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎడిఎ ఎఫ్రాయం అన్నారు. ఆర్‌బికె సేవలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడి పొందాలని అన్నారు. మండలంలోని గొర్లవారిపాలెంలో గ్రామస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో సుమతి, ఆర్బికే చైర్మన్ కావూరి రమణారెడ్డి, మండల సభ్యులు గవిని యానాదిరావు, బోయిన స్వాములు, మల్లవరపు యేసు రత్నం పాల్గొన్నారు.



వెంకారెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

మారం వెంకారెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి-చీమకుర్తి

వైసిపి అద్దంకి నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన మద్దిపాడు ఏఎంసి మాజీ ఛైర్మన్ మారం వెంకారెడ్డిని పలువురు అభినందించారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అధ్యక్షత జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో వెంకారెడ్డిని పరిశీలకులుగా నియమించారు. శుక్రవారం స్థానిక మారం వెంకారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో చీమకుర్తి మాజీ ఉపసర్పంచ్ మారం వెంకటేశ్వరరెడ్డి, వైసిపి మండల నాయకులు పి రామకృష్ణారెడ్డి, పేరం శ్రీనివాసరావు, మారం పురుషోత్తమ రెడ్డి, బిసి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దోమల పుల్లయ్య, మండల గ్రామీణ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ అశోక్, మేడగం వెంకటేశ్వరరెడ్డి, రాములు పాల్గొన్నారు.

రుణాలివ్వాలని బ్యాంకుకు తాళం వేసి నిరసన

కౌలు రైతుల ఆందోళన

ప్రజాశక్తి - భట్టిప్రోలు (చుండూరు)

చుండూరు మండలం వలివేరులో రుణాలకై చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకుకు కౌలురైతు తాళాలు వేసి శుక్రవారం ధర్నా చేశారు. రైతు సంఘం, కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో కౌలుదార్లు, రైతులు పెద్ద ఎత్తున బ్యాంకును ముట్టడించారు. బ్యాంకు కార్యకలాపాల అడ్డుకున్నారు. బ్యాంకు రీజనల్ మేనేజరు, తహసీల్దార్, వ్యవసాయ శాఖ అధికారులు పోలీసులతో ఆందోళన ప్రాంతానికి చేరుకోవటంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గత ఏడాది మాదిరిగా ప్రతి కౌలురైతుకు పంట రుణం ఇస్తామని హామినిచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. కౌలురైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు తోడేటి సురేష్ మాట్లాడుతూ 2011కౌలుదారి చట్టం కొంత మేర ఉపయోగపడినప్పటికీ సిఎం జగన్మోహన్‌రెడ్డి అధికారంలో చట్టం నిరుపయోగం అయ్యిందన్నారు. .భూయజమాని సంతకంతో కౌలు గుర్తింపు కార్డు ఇవ్వాలని చట్టంలో చెప్పటం వలన కౌలుదార్లకు ఉపయోగ పడకుండా పోయిందన్నారు. రైతుతో పని లేకుండా కౌలురైతుకు పంట రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు ములకా సాంబిరెడ్డి మాట్లాడుతూ 80శాతంపైగా కౌలు రైతులే ఉన్నారని అన్నారు. వారంతా కౌలు చేయటం మానేస్తే పంట పొలాలన్ని బీళ్లుగా మరతాయని అన్నారు. పంటలు సాగుచేసి వరదలు, విపత్తులకు కౌలుదార్లు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అలాంటి కౌలుదార్లకు 20 రోజులుగా రుణాలు ఇవ్వకుండా బ్యాంకులు చుట్టూ తిప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత్యంతరం లేని పరిస్థితిలో బ్యాంకును ముట్టడించక తప్పలేదన్నారు. అనంతరం బ్యాంకు అధికారులు, తహసీల్దార్, వ్యవసాయ అధికారులు చర్చలు జరిపి నాలుగు రోజులలోగా రుణాలు ఇస్తామని హామినివ్వటంతో బ్యాంకు తాళాలు తీసి ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కౌలురైతులు కొండముది చింపిరయ్య, ఏసోబు, రెడ్డియ్య ఉన్నారు.

'గాంధీ మళ్ళీ వస్తే' లఘుచిత్రం ప్రారంభం

ప్రజాశక్తి - బాపట్ల



సినిమా క్లాప్ కొడుతున్న డిఎస్‌పి

బాపట్ల విఆర్ క్రియేషన్స్ నిర్మాణ సారధ్యంలో గాంధీ మళ్ళీ వస్తే లఘుచిత్రం షఉటింగ్‌ను డిఎస్పీ టి వెంకటేశులు శుక్రవారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మా గాంధీ ఆశయ సాధనలో భాగంగా లఘుచిత్రం నిర్మించటం అభినందనీయమని అన్నారు. గాంధీజీ విలువల్ని గుర్తు చేసేలా సమాజాన్ని సంస్కరించే సందేశాత్మక లఘుచిత్రానికి శ్రీకారం చుట్టినందుకు చిత్ర సభ్యులను అభినందించారు. చిత్ర డైరెక్టర్ కె చంద్రశేఖర్ మాట్లాడుతూ బాపట్ల పరిసర ప్రాంతాల్లో షఉటింగ్ జరుగుతుందని అన్నారు. ఆగస్టు 15న చిత్రం విడుదల చేస్తామన్నారు. చిత్రానికి రచన వెంకు సనాతని అందించగా, గాంధీ పాత్రలో శివశంకర్ నటించనున్నారు. కార్యక్రమంలో చిత్ర సభ్యులు భ్రమర, మౌనిక, ఆదంషఫీ, సయ్యద్ పీర్, ఏడుకొండలు, బాషా, సురేష్, కృష్ణ, క్రిష్ణ కిషోర్, సాయికిరణ్, వినోద్, వెంకట్, శ్రీహరి పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మహిళ మరియు 5ఏళ్ల బాలుడి అదృశ్యమైన కేసును పోలీసులు 12 గంటలలో ఛేధించారు. ఎస్సై షేక్ నాయబ్ రసూల్ తెలిపిన వివరాల ప్రకారం ఇడుపులపాడుకు చెందిన అక్కమ్మకు 28ఏళ్ల క్రితం బండారు ప్రభాకరరావుతో వివాహ మైనది. వీరికి ఇద్దరు మగ పిల్లలు సంతానం ఉన్నారు. వారిలో మొదటి అబ్బాయి మోషేకు వివాహమైంది. అతనికి ముగ్గురు మగ పిల్లలు ఉన్నారు. వారిలో చివరివాడైన దీవెన్ కుమార్‌ను అక్కమ్మ చిన్నప్పటి నుండి పెంచింది. మద్యానికి అలవాటు పడ్డ భర్తపై విరక్తిచెంది ఈ నెల 1న హైదరాబాద్ వెతూ పిల్లవాడిని కూడా ఆమెతో తీసుకుని వెళ్ళినది. తరువాత భర్త ఇచ్చిన పిర్యాది మేరకు బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల డిఎస్పి ప్రసాదరావు, ఇంకొల్లు సిఐ వి సూర్యనారాయణ పర్యవేక్షణలో ఇంకొల్లు ఎస్ఐ షేక్ నాయబ్ రసూల్ మూడు బృందాలు ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో అదృశ్యమైన ఇద్దరినీ గుర్తించి తీసుకొని వచ్చారు. చిన్న పిల్లవాడిని తల్లిదండ్రులకు, అక్కమను ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. కేసును ఛేదించిన ఎస్సైని అభినందించారు.

జగనన్న కాలనీలను ప్రారంభానికి సిద్ధం చేయాలి

ప్రజాశక్తి వేటపాలెం

జగనన్న కాలనీలలోని లే ఔట్లలో లబ్ధిదారుల గృహాలు వేగవంతంగా పూర్తి అయ్యేందుకు కృషి చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిడి, మండల ప్రత్యేక అధికారి జె రాజాదేబోరా ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలు నందు సచివాలయాల డిడివోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆగస్టు నెలాఖరుకు జగనన్న కాలనీల ప్రారంభోత్సవాలు జరుగుతాయన్నారు. చీరాల హౌసింగ్ డిఈ గోవిందరెడ్డి మాట్లాడుతూ స్టేజీలు పూర్తయిన వాళ్లకు మాత్రమే మెటీరియల్స్ అందించాలని అన్నారు. అడ్వాన్స్ మెటీరియల్స్ ఇచ్చి ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రిస్క్ లో పడద్దని హెచ్చరించారు. జిల్లాలో మొదటగా వేటపాలెం ఉంటుందని సూచనప్రాయంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ యు అశోక్ వర్ధన్, సూపర్నెంట్ ఎంవిఎస్ శర్మ, ఈవోఆర్డీ సజ్జా శ్రీలక్ష్మి, ఏపీఎం బూదాటి శ్రీనివాసరావు, ఎఒ ఐ కాశీవిశ్వనాథం, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఎంఈఓ-2 పురుషోత్తం, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, పూర్ణకుమారి, శారద, బాలిగ సురేంద్ర పాల్గొన్నారు.

ఐద్వా పోరుయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బాపట్ల

మహిళలు, చిన్నారులపై హింస పెరిగిపోతుందని ఐద్వా జిల్లా నాయకురాలు టి సుభాషిని అన్నారు. ఈనెల 6న మహిళా పోరు యాత్ర రాష్ట్ర జాత బాపట్ల రానున్న సందర్భంగా గోడ పత్రిక ఆవిష్కరించారు. పాత బస్టాండ్ సెంటర్ వద్ద బహిరంగ సభ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు నాగలక్ష్మి, మీనాక్షి, రాణి పాల్గొన్నారు.

జీవో 46పై హాస్టల్ ఉద్యోగులకు అవగాహన అవసరం

ప్రజాశక్తి - చీరాల



మాట్లాడుతున్న ఎబిసిడబ్ల్యుఒ కల్పనబేబి

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 46పై హాస్టల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు, సిబ్బందికి అవగాహన తప్పని సరిగా ఉండాలని జిల్లా ఉపసంచాలకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిక అధికారి డి కల్పనబేబీ అన్నారు. చీరాల డివిజన్ పరిధిలోని రేయ్ మెట్రిక్ మరియు పోస్ట్మెట్రిక్ వసతి గృహ సంక్షేమ అధికారులకు, 4వ తరగతి రెగ్యులర్, పొరుగు సేవల సిబ్బందికి అవగాహన కల్పించారు. జీవో నెంబర్ 46ప్రకారం హాస్టల్లో పనిచేస్తున్న సిబ్బంది ఆ హాస్టల్ పరిధిలోనే నివాసం ఉండాలని అన్నారు. వంట సమయంలో పరిశుభ్రత పాటించాలని అన్నారు. వంట పాత్రలు శుభ్రపరిచి వాటిని ఎండలో ఆరబెట్టాలని అన్నారు. విద్యార్థులకు భోజనం, ఆహార పదార్థాలు వడ్డించే సమయంలో తప్పనిసరిగా గ్లౌజులు ధరించి శుభ్రత ప్రమాణాలను పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఎబిసిడబ్ల్యుఒ ఎన్ రాజేష్ దాసు, క్లాస్ ఫోర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పార్కును ప్రారంభించిన ఎంఎల్ఏ బలరాం

ప్రజాశక్తి - చీరాల




పార్కును ప్రారంభిస్తున్న ఎంఎల్ఏ బలరాం

పట్టణాన్ని అన్ని హంగులతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషిచేస్తానని ఎంఎల్ఏ కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. 24వ వార్డు హరిప్రసాద్నగర్‌లో నూతనంగా నిర్మించిన చిన్నపిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ ఎస్ ప్రసాదరావు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కమిషనర్ కె రామచంద్రారెడ్డి, మున్సిపల్ డీఈ ఏసయ్య, ఒకటో పట్టణ సీఐ మల్లిఖార్జునరావు, వైసచైర్మన్ జైసన్బాబు, కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, బత్తుల అనీల్, కంపా అరుణ్ పాల్గొన్నారు.

నీళ్ల బక్కెట్‌లో పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి-ముండ్లమూరు



శారిక (ఫైల్)

నీళ్ల బక్కెట్‌లో పడి చిన్నారి మృతిచెందిన ఘటన మండలంలోని వేంపాడులో శుక్రవారం జరిగింది. ఆశా వర్కర్ గండి అలేఖ్య, రోషిబాబుల కుమార్తె శారిక(1) శుక్రవారం ఉదయం ఇంటి వద్ద ఆడుకుంటూ.. నీళ్ల బక్కెట్‌లో పడింది. ఎవరూ గమనించకపోవడంతో ఊపిరాడక మతిచెందింది. చిన్నారి మృతితో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఫారెస్ట్ క్యాంపస్ స్కీం పనుల పరిశీలన

ప్రజాశక్తి - వేటపాలెం

బాపట్ల ఫారెస్ట్ డివిజన్లో క్యాంపస్ స్కీం పనులు పరిశీలిస్తున్నట్లు మంగళగిరి అరణ్య భవన్ హెడ్ ఆఫీస్ విజిలెన్స్ డిఎఫ్ఓ ఎం రవిశంకర్ శర్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో ఉన్న ఫారెస్ట్ నర్సరీని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేపల్లె, చీరాల పరిధిలో జరిగిన పనుల స్థితిగతులను పరిశీలించారు. వేటపాలెం నర్సరీకి బోర్డు ఏర్పాటు చేయాలని చీరాల ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ శ్రీదేవికి సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎఫ్ఎస్ఓ నరేంద్ర ప్రసాద్, ఎఫ్‌డిఓ కృష్ణ ప్రసాద్, చీరాల సెక్షన్ ఆఫీసర్ జాన్సన్, వేటపాలెం బీట్ ఆఫీసర్ శిరీష పాల్గొన్నారు.

చంద్రబాబుపై దాడి దుర్మార్గం

ప్రజాశక్తి - బాపట్ల

టిడిపి అధినేత చంద్రబాబు చేపట్టిన యుద్ధభేరి పుంగనూరు చేరుకున్న సందర్భంగా వైసీపీ రౌడిముకలు బరితెగించి దాడి చేయడం ఓటమికి నిదర్శనమని టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ప్రతిపక్ష నేత మీద ఇలాంటి దాడి జరగడం చూస్తే శాంతిభద్రతలు ఎంత అధ్వా న్నంగా ఉన్నాయో తెలుస్తోందన్నారు. డీజీపీ స్పందించి ఘటనకు కారణమైన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసీపీ రౌడీమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

చీరాల : వైసిపికి ఓటమి భయంతోనే పుంగనూరులో టిడిపి శ్రేణులపై రాళ్లదాడికి పాల్పడిందని టిడిపి పట్టణ అధ్యక్షులు జగవల్లి శ్రీనివాసరావు, బాపట్ల పార్లమెంట్ బీసీసెల్ అధ్యక్షులు కౌతరపు జనార్ధన్ రావు ఆరోపించారు. ఇది దుర్మార్గమైన చర్య అని ధ్వజమెత్తారు.

వైద్య కళాశాలలో కట్టుతప్పిన క్రమశిక్షణ

- గంజాయి, మద్యంకు బానిసలై హల్ చల్ చేస్తున్న విద్యార్థులు
- తాజాగా 9 మంది సస్పెన్షన్
- అర్హత లేని ప్రిన్సిపల్‌తో పర్యవేక్షణ లోపించిందని విమర్శలు



ప్రభుత్వ వైద్యకళాశాల ఇదే

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో క్రమశిక్షణ లోపించింది. విద్యార్థుల మధ్య గొడవలు నిత్య కృత్యం అయ్యాయి. కొందరు విద్యార్థులు వ్యస నాలకు బానిసలై తోటి విద్యార్థులను వేదింపులకు గురిచేస్తున్నారు. వారిని దారిలో పెట్టాల్సిన ప్రిన్సిపల్ పాలనపై అవగాహన రాహిత్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

అసలేం జరిగింది...?

ప్రభుత్వ వైద్యకళాశాలలో 2020 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ఎంబిబిఎస్ విద్యార్థులు వ్యసనాలకు బానిసలై అందరినీ ఇబ్బంది పెడుతున్నారు. గంజాయి, మద్యం తాగి అర్ధరాత్రి గొడవ చేస్తున్నారు. తోటి విద్యార్థులపై దాడులు చేస్తున్నారు. గత ఏడాది కాలంగా వీరి అరాచకాలు కొనసాగుతున్నాయి. వీరి అరాచకాలను పలువురు విద్యార్థులు గత ఏడాది నవంబర్‌లో అప్పటి ప్రిన్సిపల్ పివి సుధాకర్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన వెంటనే స్పందించి వారిని సస్పెండ్ చేశారు. ప్రిన్సిపల్ సుధాకర్ బాబు ఇటీవల రిటైర్డ్ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త వారిని నియమించడానికి కొంతకాలం పట్టింది. ఈ నేపథ్యంలో సస్పెండ్ అయిన విద్యార్థులు ఎలాగోలా మళ్లీ కాలేజిలోకి ప్రవేశించారు. వారి అలవాట్లలో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు. పాత సీన్లనే రిపీట్ చేయడం మొదలు పెట్టారు. గంజాయి, మద్యం తాగి గతంలో వారి మీద ఫిర్యాదు చేసిన విద్యార్థులపై దాడులకు పాల్పడటం, కొందరు విద్యార్థులను బెదిరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మూడు నెల కిందట సుధాకర్ బాబు అనే హెచ్ఒడి ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కాలేజీలో, హాస్టల్‌లో గొడవలు ఎక్కువయ్యాయి. ప్రతి నిత్యం ఏదో ఒక గొడవ జరుగుతూనే ఉంది. విద్యార్థులను గాడిలో పెట్టాల్సిన ప్రిన్సిపల్ పట్టీ పట్టనట్లుగా వ్యవ హరిస్తున్నారని, పరిపాలనపై పట్టు కోల్పోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గొడవలు సృష్టిస్తున్న విద్యార్థుల గురించి ప్రస్తుతం ప్రిన్సిపల్ సుధాకర్ బాబు దృష్టికి ఇటీవల కొన్ని ఫిర్యాదులు అందాయి . దీంతో ప్రిన్సిపల్ నాలుగు రోజుల కిందట తొమ్మిది మంది విద్యార్థులను వారం రోజులు సస్పెండ్ చేసినట్లు సమాచారం. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాలేదని, వసతి గృహం మెస్‌లో గొడవ జరిగిందని, గొడవకు కారణమైన విద్యార్థులను సస్పెండ్ చేశామని ఆయన వివరణ ఇవ్వడం గమనార్హం. తప్పుచేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించకుండా మెస్‌లో గొడవలంటూ సస్పెండ్ అయిన విద్యార్థులను ప్రిన్సిపల్ వెనకేసుకు రావడంలో ఆంతర్యం ఏంటని సహచర హెచ్ఒడిలు చర్చించుకుంటున్నట్లు సమాచారం.

అనర్హుడికి అందలం..

వైద్య కళాశాలకు ప్రిన్సిపల్ కావాలంటే హెచ్ఒడిగా కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. ప్రస్తుత ప్రిన్సిపల్ సుధాకర్ బాబు గుంటూరు నుంచి మూడు నెలల కిందటే పదోన్నతిపై హెచ్ఒడిగా ఇక్కడ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈయన కంటే దాదాపు పది మంది సీనియర్ హెచ్ఒడిలు ప్రిన్సిపల్‌గా ఎంపిక చేయడానికి అర్హులు ఉన్నప్పటికీ వారందరిని కాదని అందరికంటే జూనియర్ హెచ్ఒడిగా ఉన్న సుధాకర్ బాబును వైద్య శాఖ ఉన్నతాధికారులు ప్రిన్సిపల్‌గా అందలం ఎక్కించడం ఏంటని సహచర సీనియర్ హెచ్ఒడిలే విమర్శలు గుప్పిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వైద్యఆరోగ్యశాఖ డిఎంఎ ఆఫీసులో తన పరపతిని ఉపయోగించి తనకు అర్హత లేకపోయినా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా సుధాకర్ బాబు పోస్టింగ్ తెచ్చుకున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

భయం గుప్పిట్లో విద్యార్థులు....

వైద్య కళాశాలలో అల్లరి మూకలు పెట్రేగి పోతుండటంతో వందలాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అసలు వైద్య కళాశాలలోకి గంజాయి, మద్యం ఎలా సరఫరా అవుతుందో అర్ధంకాని పరిస్థితి ఉంది. విద్యార్థులపై ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు బయటకు పంపడం, వారిమీద గట్టి నిఘా లేకపోవడంతో దేవాలయం లాంటి వైద్య కళాశాల, హాస్టల్‌లోకి మత్తు పదార్థాలు ప్రవేశిస్తున్నాయని తెలిసింది. దీనిపై పోలీసు శాఖ ఉన్నతాధికారులకు కూడా సమాచారం ఉన్నట్లు తెలిసింది. అయితే విద్యార్థుల పట్ల నిత్యం పర్యవేక్షణ ఉంచాల్సిన ప్రిన్సిపల్, సిబ్బంది మత్తు పదార్థాలు కాలేజీలోకి రాకుండా అడ్డుకోవడంలో వైఫ్యల్యం చెందారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.గత ఏడాది కాలంగా పలువురు వైద్య విద్యార్థులు పట్టు తప్పి వ్యవహరిస్తుండటం, వారి పట్ల కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం పూర్తిగా వైద్యకళాశాల ప్రిన్సిపల్ పాలనా వైఫల్యమనే విమర్శలు వినిపిస్తున్నాయి.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పామూరు

ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన హింసపై మహిళల పోరుయాత్ర జాతాను జయప్రదం చేయాలని ఐద్వా మండల అధ్యక్షురాలు జి. భానుమతి కోరారు. పోరుయాత్ర జాతాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోరు బస్సు యాత్ర ఈనెల 6న కనిగిరికి చేరుకుంటుదన్నారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోరు యాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 8న విజయవాడలో బహిరంగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ సభలో ముఖ్య అతిథులగా ఆల్ ఇండియా నాయకులు బందా కరత్, ఎస్.పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పాల్గొనున్నట్లు తెలిపారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్ బి.సయ్యద్ రమిజ, బి.పరిమళాదేవి, వి.అంజలి పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌పై అవగాహన

ప్రజాశక్తి-దోర్నాల

వర్షాకాలంలో వ్యాధులు ప్రభలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావు తెలిపారు. సర్పంచి చిత్తూరి హారిక అధ్యక్షతన స్వచ్ఛ భారత్‌పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెత్తాచెదారాలను ఎక్కడపడితే అక్కడ పడవేయ కూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ అన్నపూర్ణ, సిసి ఆదాం, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయండి

టిడిపి జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సాగు నీటి ప్రాజెక్ట్ సందర్శనలో భాగంగా టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 6న గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌ను సందర్శించ నున్నారని, పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ తెలిపారు. భాగ్యనగర్ 4వ లైన్‌లోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయ్‌కుమార్‌తో కలసి శుక్రవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ వైసిపి పాలనలో సాగునీటి ప్రాజెక్టుల నిర్లక్ష్య వైఖరిని ప్రజలకు తెలియజేసేందుకు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఈనెల 6న మధ్యాహ్నం 1 గంటకు మద్దిపాడు మండలం, మల్లవరం దగ్గరలోని గుండ్లకమ్మ ప్రాజెక్ట్ ను సందర్శించ నున్నారన్నారు. అనంతరం సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రైతులు, వివిధ ప్రాజెక్టులపై చెప్పగలిగిన వారు, నీటిపారుదల రంగం అభివృద్ధితో సమాజం, రాష్ట్రం బాగుంటుందనే అభిప్రాయాలు



మాట్లాడుతున్న నూకసాని బాలాజీ

చెప్పగలిగిన మేధావులు, విద్యావంతులు ఈ ఇష్టా గోష్టి కార్యక్రమంలో పాల్గొనాలని నూకసాని విజ్ఞప్తి చేశారు. టిడిపి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయ్ కుమార్ మాట్లాడుతూ ఏడాదిగా ప్రాజెక్టు గేట్లు నుంచి నీరు వథాగా పోతుంటే ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా టిడిపి నేతలు స్పందించినప్పుడు ప్రభుత్వం గేట్లు మరమ్మతులు చేపట్టిందని, మరమ్మతులు తూతూ మంత్రంగా చేశారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ కార్యదర్శి అడకా స్వాములు, జిల్లా అధికార ప్రతినిధి మొగల్ కాలేషా బేగ్, నాగులుప్పలపాడు మండట టిడిపి అధ్యక్షుడు తేళ్ల మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు కాలువ పరిశీలన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని కడప రాజుపల్లె వద్ద శ్రీపూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు కాలువ మూడేళ్ల క్రితం వరద నీటి ప్రభావంతో తెగిపోయింది. తెగిపోయినకాలువను ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలిగిపోయిన కాలువను మట్టితో నిర్మించారన్నారు. అక్టోబర్‌లో వెలిగొండ ప్రాజెక్టు నీళ్ల వదిలితే కట్ట తెగిపోయి కడపరాజుపల్లి, అయినముక్కుల, పలుకుమడుగు గ్రామాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు.


కాలువను పరిశీలిస్తున్న వెంకటరామిరెడ్డి

ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పట్టణశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ స్పందించి కాలువను పరిశీలించి ఆస్తి నష్టం జరగ కుండా కాంక్రీటుతో నిర్మించాలన్నారు. నల్లమల్ల సాగరులేకి చుక్క నీరు వెళ్లే అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో దోర్నాల ఏరియా నాయకులు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, జంగిలి వెంకటేశ్వర్లు, పోలశెట్టి నాగేశ్వరరావు, యాకోబు, ఆది నారాయణ పాల్గొన్నారు.


పుస్తకాలు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

విశ్రాంత ఉపాధ్యాయుడు శాఖమూరి వెంకటేశ్వర్లు మనమరాలు నేతి తులసి నాగలక్ష్మీ, ఆళ్ళ భార్గవ్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా స్థానిక శిరిడిసాయి ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులకు శుక్రవారం పాఠ్యపుస్తకాలు అందజేశారు. శాఖమూరి వెంకటేశ్వర్లు చేతులు మీదుగా పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు గోసు ఓబుల్‌రెడ్డి,పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగర పరిధిలోని తొమ్మిది, పదో డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ గంగాడ సుజాత శుక్రవారం శంకుస్థాపన చేశారు. తొలుత తొమ్మిదో డివిజన్ రాజీవ్ కాలనీలో రూ.23.70లక్షల వ్యయంతో సిసి డ్రెయిన్ నిర్మాణానికి, పదో డివిజన్ బృందావన కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమలో తొమ్మిదో డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస శోభారాణి, వైసిపి నాయకులు వెన్నపూస వెంకటరెడ్డి, పదో డివిజన్ కార్పొరేటర్ బెంగళూరు నర్సయ్య, కార్పొరేషన్ ఇంజినీర్ మల్యాద్రి, డిఇఇ రఘురాం పాల్గొన్నారు.

బూచేపల్లి ఇంట ప్రత్యేక పూజలు

దర్శి : జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ధర్మపత్ని నందిని హైదరాబాదులోని తమ స్వగృహంలో శుక్రవారం అష్టలక్ష్మి అమ్మవారి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆయన సతీమణి శచిదేవి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పాలసేకరణ కేంద్రంలో తనిఖీ

శింగరాయకొండ : అమూల్ పాల కేంద్రాలకు పాలు పోస్తున్న పాడి రైతులు అదనపు ఆదాయం పొందుతూ ఆర్థికంగా అభివద్ధి చెందుతున్నారని పశుసంవర్ధక జేడీ డాక్టర్ బేబీ రాణి తెలిపారు. మండల పరిధిలోని కలికివాయ గ్రామంలోని అమూల్ పాల కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు సబ్సిడీపై అందిస్తున్న సమీకత దాణా, పాల ఉత్పత్తి పెరుగుదల గురించి రైతులకు వివరించారు. పశుకిసాన్ క్రెడిట్ కార్డు, పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ హజరత్, నగళ్ళ, రూట్ ఇన్‌ఛార్జి మౌలమ్మ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

నాగులుప్పలపాడు : విద్యార్థులను ప్రోత్సహించేందుకు 1985-86 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సంఘం ముందు వరుసలో ఉంటుందని పూర్వ విద్యార్థి జి. వేణు గోపాల్ తెలిపారు. మండల పరిధిలోని కూనం రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హెచ్. నిడమానూరు పాఠశాలలో 1985-86లో పదవ తరగతి చదివిన పూర్వర్థుల ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.50 వేల విలువైన ప్రాజెక్టు , లఘుపరీక్ష, పుస్తక సమీక్ష రాసుకొనేందుకు అవసరమైన నోట్ పుస్తకాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఊదరగుడి రామ స్వామి, గ్రామ సర్పంచి వడ్డిముక్కల శ్రీనివాసరావు, మాలె గంగిరెడ్డి, నన్నెబోయిన శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి ప్రధానో పాధ్యాయుడు లాల్ సాహెబ్, పూర్వ విద్యార్థులు పాలేటి శేషగిరి, వంగర శ్రీనివాసరావు, దార్ల శ్రీనివాసరావు, ఊదరుగుడి ఆనందబాబు, విద్యార్థులు పాల్గొన్నారు

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-సిఎస్‌పురం

క్రీడలు మానసిక ఉల్లాసం, శరీర దారుఢ్యానికి దోహదపడతాయని కదిరి బాబూరావు విద్యాసంస్థల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ పార్థసారథి తెలిపారు. ఈనెల 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కదిరి బాబూరావు వ్యవసాయ మరియు ఉద్యాన కళాశాలలో విద్యార్థులకు కీడ్రల పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సంద్భంగా పార్థసారథి మాట్లాడుతూ విద్యార్థులు గెలుపు, ఓటములపు సమానంగా స్వీకరిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ నున్నా త్రిమూర్తులు, ఉద్యాన కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్, పీడీలు బండారు రవీంద్రబాబు, బి.మౌనిక, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రలో రైతులు

ప్రజాశక్తి - గిద్దలూరు

సుగంధ ద్రవ్యాల సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులను విజ్ఞాన యాత్రకు తీసుకెళ్లారు. గిద్దలూరు, మార్కాపురం, కంభం, బేస్తవారిపేట, పొదిలి, యర్రగొండపాలెం, ఒంగోలు మండలాలకు 35 మంది రైతులను రైతులు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడిసినల్ అండ్ అరోమాటిక్ ప్లాంట్స్‌కు తీసుకెళ్లి అవగాహన కల్పించినట్లు గిద్దలూరు ఉద్యానశాఖ అధికారి దుత్తా శ్వేత తెలిపారు. సుగంధ పంటల సాగుకు ఆసక్తి చూపుతున్న విజ్ఞాన యాత్రలో పాల్గొన్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ బాబు, డాక్టర్ కోటేష్, డాక్టర్ జ్ఞానేష్, కెవిఎన్. సత్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు సలహాలు చేశారు. గత వార్షిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ ద్వారా వచ్చిన ఆదాయం, ఆదాయంలో తేడాలను సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కనిగిరి

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ తెలిపారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ సరోజని, మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, వైస్ ఛైర్మన్ పులిశాంతి, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **శింగరాయకొండ :** మండల పరిధిలోని శానంపూడి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్ వైజర్ రిజ్వానా మాట్లాడుతూ బిడ్డల అందించాల్సిన పోషకాలు, వ్యక్తి గత పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.రవికుమార్, ఎఎన్‌ఎం నాదెళ్ల సాయి, ఎంపిటిసి సుమతి, సచివాలయ మహిళా పోలీస్ నయోమి, రోటరీ క్లబ్ కార్యదర్శి పంతగాని వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు మాధవి, అరుణ, అంగన్‌వాడీలు దయమ్మ, అరుణ పాల్గొన్నారు. **రాచర్ల :** మండల పరిధిలోని రంగారెడ్డి పల్లి, సత్యవోలు -1, సత్యవోలు -2 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ క్విట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి పల్లి ఎంపీ యూపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు , అంగన్‌వాడీ లక్ష్మి రాజ్యం, కొండమ్మ. సరమ్మ, సచివాలయ ఎఎన్‌ఎం లు, మహిళా పోలీస్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **దర్శి :** మండల పరిధిలోని రాజంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచి వనం అన్నపూర్ణ చేతుల మీదుగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీలు నరసమ్మ, చిన్నఅంకమ్మ పాల్గొన్నారు. **కొనకనమిట్ల :** మండల పరిధిలోని గనివెనపాడు అంగన్‌వాడి కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైయస్సార్ సంపూర్ణ కిట్లను సర్పంచి పాలూరి లక్ష్మీ వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు జిల్లెల్ల భూలక్ష్మి, నాయకులు పాలూరి వెంకటసుబ్బయ్య, బంకు కాశయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో

సమస్యల పరిష్కారానికి కృషి

అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార సంస్థ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దిశెట్టి వరలక్ష్మి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అంగన్‌వాడీ కేంద్రాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలుగునాడు అంగన్‌వాడీ, డ్వాక్రా రాష్ట్ర సాధికార సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దిశెట్టి వరలక్ష్మి తెలిపారు. స్థానిక రాజాపానగల్ 3వ లైన్‌లోని 7,9 అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఇచ్చే గుడ్లు, పౌష్టికాహారం సరైన సమయానికి పెడుతున్నారా లేదా ?బాలింతలు, గర్భిణులఖష్ట సరైన సమయానికి పౌష్టికాహారం అందుతుందా లేదా అని ఆరా తీశారు. తమకు రేషన్ కార్డులు తొలగించకుండా, సంక్షేమ



అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న వరలక్ష్మి

పథకాలు అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్ మెంట్ బెనిఫిట్ రూ. 5 లక్షలు ఇవ్వాలని ఈ సందర్భంగా అంగన్‌వాడీలు కోరారు. ఈ సందర్భంగా పెద్దిశెట్టి వరలక్ష్మి మాట్లాడుతూ ఈ సమస్యలను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు అంగన్వాడీ-డ్వాక్రా సాధికారిక సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత దష్టికి తీసుకువెళ్లి కచ్చితంగా పోరాడుతానని భరోసా ఇచ్చారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం కిట్లను అంద జేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో ఆర్‌జెడి తనిఖీ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం మెరుగైన విద్యా విధానాన్ని అమలు చేస్తుందని గుంటూరు ఆర్‌జెడి విఎస్. సుబ్బారావు తెలిపారు.స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత పాఠ్యపుస్తకాలు, జివికె.యూనిఫాం, ఐఎఫ్‌పి ప్యానల్, ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు అత్యవసరం మినహాయిస్తే తప్ప పది శాతానికి మించి ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వరాదన్నారు. వరండాలలో తరగతులు, విద్యాబోధన చేసే విధానానికి స్వస్తి చెప్పాలన్నారు. అనంతరం పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్, ఎంఇఒ బి.రాందాస్ నాయక్, టి.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో తనిఖీ చేస్తున్న ఆర్‌జెడి సుబ్బారావు

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-దర్శి

ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. దర్శి నగర పంచాయతీ పరిధిలోని 18వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ తిరిగి ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ కమిషనర్ మహేష్, తహశీల్దారు వెంకటేశ్వర్లు, డిటీ రవిశంకర్, వైసిపి మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, కౌన్సిలర్లు విసిరెడ్డి, మోహన్‌బాబు, నారాయణమ్మ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

నాసర్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే ఉడుముల నివాళి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల పరిధిలోని కాట్రగుంట పంచాయతీ మాజీ సర్పంచి, వైసిపి నాయకుడు తేలుకుట్ల నాసర్‌రెడ్డి(78) గురు వారం రాత్రి మతి చెందారు. నాసర్‌రెడ్డి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన మృతదేహాన్ని కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి సందర్శి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మూరబోయిన మురళీకష్ణ, మండల ఉపాధ్యక్షులు మెట్టు వెంకటరెడ్డి, గొంగటి జెనిఫా, వైసిపి మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, అధ్యక్షుడు కామసాని వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ సర్పంచి తేలుకుట్ల నాసర్‌రెడ్డి మృతదేహాన్ని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కందేర నాసరయ్య, వెలుగొండ ఆలయ మాజీ ఛైర్మన్ కుందురు కాశిరెడ్డి, సాదం వీరయ్య, నాగిరెడ్డి బీమాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

టిడిపి నాయకులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పొదిలి

అధికార పార్టీ అక్రమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని టిడిపి మార్కాపురం నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బూత్ లెవల్ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీప్రజల్లో విశ్వాసం కోల్పోతున్న తరుణంలో దొంగ ఓట్లుతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుందన్నారు. దొంగ ఓట్ల నమోదు పట్ల టిడిపి నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలకలు పంపిణీ

యర్రగొండపాలెం : మండల పరిధిలోని నరసాయ పాలెం మెయిన్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చెరుకూరి శ్రీనివాస చౌదరి ఆధ్వర్యంలో పలకలు, కాపీ పుస్తకాలు, పెన్నులు, బలపాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎస్.మల్లునాయక్, ప్రధానో పాధ్యాయురాలు జి.జ్యోతి, సర్పంచి సిహెచ్. వెంకటరామయ్య, పాఠశాల కమిటీ ఛైర్మన్ కొండలరావు, స్థల దాత చిమటా పెద్దసుబ్బయ్య పాల్గొన్నారు.

డిఎస్‌పికి వినతి

దర్శి : దళితుడు లోకయ్యను కులం పేరుతో దూషించిన నాగరాజును అరెస్టు చేయాలని కోరుతూ డిఎస్‌పి అశోక్‌వర్ధన్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌కుమార్, ప్రసాద్, రామయ్య, వీరయ్య, కిషోర్, బాధితుడు లోకయ్య పాల్గొన్నారు.

మట్టి తవ్వకం నిలిపివేత

మార్కాపురం : మార్కాపురం ప్రాంతంలో అక్రమంగా మట్టి తక్వాలు చేపడుతున్నారు. గోగులదిన్నెలో నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఓ వ్యక్తి అధికార పార్టీ పేరు చెప్పుకుని మట్టిని తరలిస్తున్నారు. అక్రమ తవ్వకాల గురించి స్థానికులు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదికారులు కదిలారు. శుక్రవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి మట్టి తవ్వకాలను నిలిపివేశారు. జెసిబిని స్వాధీనం చేసుకున్నారు.

నేడు లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం

మార్కాపురం : మార్కాపురంలోని కాలేజి రోడ్డులో జిఎస్ఆర్ ప్లాజాలో 'లక్కీ షాపింగ్ మాల్' శనివారం ప్రారంభం కానుంది. సినీ హీరోయిన్ హనీరోజ్ చేతుల మీదుగా లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం కానుంది. ఈ షాపింగ్ మాల్‌లో మహిళలు, పురుషులతో పాటు చిన్నారులకు సంబంధించిన అన్ని రకాల దుస్తులు లభించనున్నాయి.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అర్ధవీడు : అర్ధవీడు మండలం మోహిద్దీన్‌పురం 33 కెవి ఫీడర్ పరిధిలోని అర్ధవీడు, పాపినేనిపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని సాంకేతిక మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎఇ నారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

తక్కువ కాలం పంటలు సాగు చేయాలి

పిసిపల్లి : స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఎఒ జి.వెంకటస్వామి అధ్యక్షతన గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ రమణ మాట్లాడుతూ ప్రస్తుతం పరిస్థితుల్లో తక్కువ కాలంలో పండే పంటలను సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎఎబి మెంబర్లు, రైతులు, విఎఎలు పాల్గొన్నారు

పంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలివ్వాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

- **కలెక్టర్** కార్యాలయం ఎదుట ధర్నా
- కనీస వేతన చట్టం అమలు చేయాలని సిఐటియు డిమాండ్
- టెండర్ల విషయంలో కోర్టు తీర్పును అమలు చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల
జిల్లాలో పంచాయతీ కార్మికుల పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నా నుద్దేశించి సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడారు. జిల్లాలో అనేక పంచాయతీల్లో రెండు నుండి 18నెలల వరకు కార్మికులకు జీతాలు పెండింగ్ ఉన్నాయి. వెంటనే పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు కరోనాకాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించారని అన్నారు. అలాంటి కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను అమలు చేయాలని కోరారు. ప్రతి ఏడాది టెండర్ విధానాన్ని రద్దుచేసి పాతవారిని కొనసాగించాలని హైకోర్టు తీర్పునిచ్చినప్పటికీ అనేక పంచాయతీల్లో అమలు చేయడం లేదని అన్నారు. టెండర్ల ద్వారా కార్మికులను తీసుకుంటూ పెద్ద ఎత్తున కార్మికుల నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనంరూ.26వేలు నిర్ణయించి అమలు చేయాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం వసంతరావు మాట్లాడుతూ చీరాల మండలం వాడరేవు పంచాయతీలో 14నెలలు వేతనాలు పెండింగ్ ఉన్నాయని అన్నారు. వేతనాల విషయమై పంచాయతీ కార్యదర్శిని అడిగితే బడ్జెట్ లేదని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం పంచాయతీ కార్మికులు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ నాయకులు సురేషు, పోతురాజు, సుశీల, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డాక్టర్ నాగసూరికి ఘన సన్మానం

ప్రజాశక్తి - అద్దంకి
అమర జీవి పొట్టి శ్రీరాములు జీవితంపై పరిశోధన నిమిత్తం వచ్చిన ఆల్ ఇండియా రేడియో మాజీ డైరక్టర్ జనరంజక విజ్ఞాన రచయిత, మాధ్యమాల విశ్లేషకుడు, సాహిత్యాంశాల పరిశీలకుడు, పాఠ్యాంశాల రచయిత, ఆకాశవాణి ప్రయోక్త డాక్టర్ నాగసూరి వేణుగోపాల్‌ను రోటరీ, సృజన, సాహితీ మిత్రమండలి ఘనంగా సన్మానించారు. పొట్టి శ్రీరాములు జీవితంపై సాధికారికంగా ప్రసంగించారు. పద్యశాసనం, ఎర్రాప్రగడ స్థూపాలను సందర్శించి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి, చిన్నిమురళీకృష్ణ, చుండూరి మురళీసుధాకరరావు, చప్పిడి వీరయ్య, డాయు దేవపాలన, డివియం సత్యనారాయణ, నాగసూరి వెంకట సుబ్బారావు, లక్కరాజు చంద్రశేఖర్, తమ్మన శ్రీనివాసరావు, పసుపులేటి ఆంజనేయులు, అంజాద్ భాష, మలాది శ్రీనివాసరావు, అళహరి హరిబాబు, అన్నంగి సుబ్బారావు పాల్గొన్నారు.

యుటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - పంగులూరు
యుటిఎఫ్ సభ్యత్వ నమోదు మండలంలో శుక్రవారంగా జరిగింది. పాఠశాలలకు వెళ్లి యుటిఎఫ్ నాయకులు సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. బూదవాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల నుండి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కల్లంవారిపాలెం, చిన్న మల్లవరం, పంగులూరు, కొండమంజులూరు, కోటపాడు, చందలూరు, తూర్పు కొప్పెరపాడు వరకు సభ్యత్వం నమోదు పూర్తయినట్లు మండల అధ్యక్షుడు టివీ నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కుటుంబ సంక్షేమ డైరెక్టర్ ఆర్ శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్ ఎస్వీడివి ప్రసాద్, కోశాధికారి బి రవిచంద్రబాబు, ఉపాధ్యక్షులు కె సోమశేఖర్, బి ఏడుకొండలు, బి సుబ్బారావు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె
నిభందనలు పాటించని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రేపల్లె ఎంఇఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ జిల్లాలో విద్యాహక్కు చట్టం ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు చుట్టంలా పనిచేస్తుందని అన్నారు. జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వల్లే కార్పొరేట్ విద్యా సంస్థలు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు.


ఎంఇఒకు వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ

కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించడంలో అధికారులకు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల మానసిక స్థితిని దెబ్బతీస్తున్నారని అన్నారు. విద్యాహక్కు చట్ట ప్రకారం పాఠశాలలో చేపట్టే నిబంధనలను పేరెంట్స్ కమిటి జరిపి అమలు చేయాల్సి ఉందన్నారు. అలా కాకుండా తమ ఇష్టం వచ్చినట్లు చేయడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సూర్య ప్రకాష్, నాయకులు ప్రవీణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ ఆధునీకరణకు వినతి

ప్రజాశక్తి - రేపల్లె
రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు చేపట్టాలని పట్టణాభివృద్ధి సంఘం నాయకులు సివి మోహనరావు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత భారత్ పథకంలో భాగంగా రేపల్లె రైల్వే స్టేషన్ ఆధునీకరణ, అభివృద్ధి నిమిత్తం, రైలు ప్రయాణికులకు గరిష్టంగా మేలు కలగాలనే ఉద్దేశముతో అధికారులకు సూచనలు చేశానన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థము ఒకటవ నంబర్ ప్లాట్ ఫారం, రెండవ నెంబర్ ఫ్లాట్ ఫారంను కలుపుతూ నడక వంతెన నిర్మించాలని అన్నారు. రైల్ కోసం నిరీక్షించే ప్రయాణికుల కోసం అన్ని హంగులతో 24గంటలు అందుబాటులో ఉండే జనరల్ వెయిటింగ్ హాల్ నిర్మించాలన్నారు. దూరప్రాంతాలనుండి వచ్చి మోపిదేవి, కళ్లేపల్లి, హంసలదీవి లాంటి పుణ్య క్షేత్రాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం స్టేషన్‌లో రిటైరింగ్ రూమ్స్, డార్మిటరీ అవసరం అన్నారు. ఫ్లాట్ ఫారంల మీద శుభ్రమైన త్రాగు నీరు, అందుబాటులో ఉండే విధంగా వాటర్ ట్యాప్‌లు ఏర్పాటు చేయలని కోరారు. ఎండ, వాన, చలి నుండి ప్రయాణికుల రక్షణ కొరకు, రెండు ఫ్లాట్ ఫారములకు పూర్తిగా రూఫింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. కూర్చోనేందుకు సౌకర్యాలు కల్పించాలన్నారు. జనరల్ బుకింగ్ కౌంటర్స్ తో సంబంధం లేకుండా ప్రత్యేకంగా రిజర్వేషన్ కౌంటర్ హాలును ఒకటవ నంబరు ప్లాట్ ఫారం మీద ఏర్పాటు చేలని కోరారు. రైల్వే ప్రాంగణంలో ప్రయాణీకుల సౌకర్యార్థం ఫుడ్ కోర్ట్ ను ఏర్పాటు చేయాని కోరారు.

విత్తనాలు తయారు చేసుకోవచ్చు

ప్రజాశక్తి - చెరుకుపల్లి
గ్రామ విత్తన పథకము ద్వారా రైతులు సొంతంగా విత్తనాలు తయారు చేసుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం ట్రైనింగ్ కోఆర్డినేటర్ విజయ నిర్మల అన్నారు. గ్రామ విత్తన పథకము మొదటి శిక్షణ కార్యక్రమాన్ని మండలంలోని జొన్నలగడ్డవారిపాలెంలో శుక్రవారం నిర్వహించారు. డాట్ సి కోఆర్డినేటర్ ఓబయ్య, డాక్టర్ సురేఖ దేవి, డాట్ సి సైంటిస్ట్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరి లు మాట్లాడారు. రైతులు విత్తనాలు తయారు చేసుకునే విధానాన్ని వివరించి సలహాలు ఇచ్చారు. ఈ పథకం ద్వారా నాణ్యమైన విత్తనాల తయారీతోపాటు డబ్బు ఆదా అవుతుందన్నారు. వెద సాగు, కలుపు, నారుమడులలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎఒ టి బాలాజీ గంగాధర్ అధ్యక్షత వహించారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - అద్దంకి
పౌష్టికాహారం గర్భిణీలు, బాలింతలకు అందినప్పుడే తల్లి బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని మున్సిపల్ 10వ వార్డ్ కొమ్మలపాటి సుధీర్ అన్నారు. స్థానిక అంగనవాడి కేంద్రాలలో సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్లు ఆశా వర్కర్లు, బాలింతలు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

మేదరమెట్ల : మండలంలోని దైవాల రావూరులో తల్లి పాలవారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ కె ఇందిర మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు శ్రేష్టమని, ముర్రు పాలుల్లో అనేక పోషకాలు ఉంటాయని తెలిపారు. 6నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని బిడ్డకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఆరోగ్యమ్మ, అంగనవాడి కార్యకర్తలు విజయ కుమారి, సుభాషిని, ఇందిరా పాల్గొన్నారు.

పంగులూరు : తల్లిపాల వారోత్సవాలు మండలంలోని రామకూరు అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ పద్మజ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు తాగించాలని తెలిలపారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని అన్నారు. ముర్రు పాలు అమృతంతో సమానమని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శ్రావణి మహిళా కానిస్టేబుల్ సుధారాణి, అంగన్వాడీ టీచర్లు ఆర్ అనురాధ, కే తులసి, ఎన్ అరుణ, ఆశ వర్కర్లు ఆర్ పద్మావతి, ఏ కృపారత్నం పాల్గొన్నారు.


కోర్టు ఆవరణలో మీడియాతో ఆమంచి

ఆమంచిపై కేసులు కొట్టివేత

ప్రజాశక్తి-వేటపాలెం
చీరాల మాజీ ఏమ్మెల్యే, పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జీ ఆమంచి కృష్ణమోహన్‌పై నమోదైన మూడు కేసులను శుక్రవారం కొట్టివేశారు. చీరాల రూరల్, చీరాల వన్ టౌన్, నాగులుప్పలపాడు స్టేషన్‌ల్లో నమోదైన కేసులు విజయవాడ ప్రజాప్రతినిధుల స్పెషల్ కోర్టులో కొంతకాలంగా విచారణ జరుగుతుంది. ప్రాసిక్యూషన్‌లో పోలీసులు నేరాన్ని రుజువు చేయలేకపోవడంతో కేసులు కొట్టేసినట్లు ఆమంచి అనుచరులు తెలిపారు. ఈసందర్భంగా ఆమంచి అనుచరులు సంతోషం వ్యక్తం చేశారు.


లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న టిడిపి కార్యకర్తలు

స్పందనకు ట్రిబుల్ ఐటీ సీటు

ప్రజాశక్తి - పంగులూరు
మండలంలోని చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన అత్తింటి స్పందనకు ట్రిబుల్ ఐటీ సీటు వచ్చింది. మొదటి విడత ట్రిబుల్ ఐటీ సీట్లలో ఈ పాఠశాలకు 10సీట్లు వచ్చిన విషయం తెలిసిందే. రెండవ విడత సీట్లను శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసింది. రెండో విడతలో పాఠశాలకు చెందిన అత్తింటి స్పందనకు శ్రీకాకుళం ట్రిబుల్ ఐటీలో సీటు వచ్చింది. దీంతో పాఠశాలకు 11సీట్లు వచ్చినట్లయ్యింది. 10వ తరగతిలో స్పందనకు 551మార్కులు వచ్చాయి. ఎస్సిసి క్యాటగిరిలో స్పందనకు సీటు వచ్చినట్లు పాఠశాల హెచ్‌ఎం చందలూరు గిరిజ తెలిపారు. ట్రిబుల్ ఐటీ లో సీట్ సాధించిన స్పందనను అభినందించారు.

సుబ్బారావుకు జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి - బాపట్ల రూరల్
చెరువు జమ్ములపాలెంలో శ్రీ సీతారామ స్వామి దేవస్థానంలో శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా ఆచంట గ్రామస్తులు నెక్కంటి సుబ్బారావుకు గ్రామస్తులు, ప్రాణాదార సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జీవిత సాఫల్య పురస్కారం అందజేశారు. ప్రణాధార సంస్థ అధ్యక్షులు పుండరీ కాక్షయ్య మాట్లాడుతూ పండిట్ పురస్కార్ గ్రహీత నెక్కంటి సుబ్బారావు శాస్త్రవేత్తలు చేయలేనిది రైతుగా సాధించారన్నారు. దేశ ఆహార భద్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న అన్నదాత, ఆహార స్థిరత్వానికి దోహదపడే రైతు శాస్త్రవేత్తగా, విదేశీ మీడియా నుంచి ప్రశంసలు అందుకున్నారు. వరి పంట పొట్టి రకము ఐఆర్-8, స్వర్ణ హబ్1 రకాల విస్తీర్ణకు కృషి చేసినారు. 1970లో భారతదేశం ఆహార కొరత ఉన్న సమయంలో వరి పొట్టి రకం అధిక దిగుబడి నిచ్చు రకాలు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వ్యాప్తికి సేవ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల యుగంధరరావు, నెక్కంటి కిరణ్ ప్రకాష్, నూతలపాటి బాబు, ఆకుల సాంబశివరావు, గూడూరు బాబు, కుర్ర నాగేశ్వరరావు, డాక్టర్ అశోక్ కుమార్, కాపు అంకమ్మ పాల్గొన్నారు.


సుబ్బారావును సన్మానిస్తున్న గ్రామస్తులు

అవి అనధికార వెంచర్లు

ప్రజాశక్తి - బాపట్ల రూరల్
ఎటువంటి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వెంచర్లు వేస్తే చర్యలు తప్పవని కంకటపాలెం కార్యదర్శి షేక్ కరిముల్లా షా ఖాదరి హెచ్చరించారు. గ్రామంలో అనధికారికంగా వేసిన లేఅవుట్ వద్ద శుక్రవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లేఔట్‌కు పంచాయతీ అనుమతులు లేవని తెలిపారు. అక్కడ ప్లాట్లు కొంటే పంచాయితీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. కొని ఇబ్బందులు పడవద్దని తెలిపారు.

లోకేష్‌కు ప్రజల ఘన స్వాగతం

ప్రజాశక్తి - సంతమాగులూరు
మండలంలోని పుట్టావారిపాలెం అడ్డ రోడ్డు జంక్షన్‌లో మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజలు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. లోకేష్ పల్నాడు జిల్లా వినుకొండ మండలంలో యువగళం పాదయాత్ర గురువారం ముగించుకుని కోర్టు పనుల నిమిత్తం అమరావతి వెళ్లి తిరిగి శుక్రవారం వస్తుండగా అడ్డరోడ్ జంక్షన్‌లో ప్రజలు ఘన స్వాగతం పలికారు. లోకేష్ కార్యకర్తల యోగక్షేమాలు తెలుసుకున్నారు. కొందరు పిల్లలతో వచ్చి సెల్ఫీలు దిగారు. యువగళం పాదయాత్ర పల్నాడు జిల్లాలో ఉన్నందున ఎక్కువసేపు మీతో ఉండలేనని ప్రతి ఒక్కరికీ కరచాలనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండపునేని రామకృష్ణ, సురేష్, వెంకటేశ్వర్లు, నంబుల కొండలు, సింబోతుల వీరయ్య పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

కేంద్ర కార్మిక సంఘాల నేతల పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

క్విట్ ఇండియా డేను పురస్కరించుకొని ఒంగోలు, కలెక్టరేట్ వద్ద ఈ నెల 9న జరిగే నిరసన కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 9న క్విట్ ఇండియా డే తేదీని పురస్కరించుకొని నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చాయన్నారు. దేశవ్యాప్తంగా 1942 ఆగస్టు తొమ్మిదిన బ్రిటిష్ వారిని దేశం నుంచి వదిలిపోవాలని చెప్పి స్వాతంత్ర్య పోరాట నాయకులు పిలుపునిచ్చారని, 1947లో స్వాతంత్రం వచ్చిన తర్వాత బ్రిటిష్ వారు వెళ్ళిపోయారన్నారు. నేటికీ కేంద్రంలో బిజెపి పభుత్వం తొమ్మిది సంవత్సరాల నుంచి పరిపాలన కొనసాగిస్తుందని, ఈ కాలంలో ఉద్యోగులు, కార్మికులు, ప్రజల జీవన



మాట్లాడుతున్న కాలం సుబ్బారావు


పరిస్థితులు తారుమారయ్యాయన్నారు. ఉద్యోగులు, కార్మికులకు లేబర్ కోడ్స్ తీసుకురావడంతో చాలా ఇబ్బందులు వచ్చాయని, వేతనాలు లేకపోవడం, పని భారం పెరగటం, శ్రామిక మహిళ పరిస్థితి మరీ దైన్యంగా ఉందన్నారు. మోడీ ప్రభుత్వం రైతులకు వ్యవసాయ నల్ల చట్టాలు తీసుకొచ్చి వారిని అసౌకర్యానికి గురి చేసిన పరిస్థితి చూశామని, దాదాపు 800 మంది రైతులు ప్రాణత్యాగం చేసిన ఫలితంగా మోడీ ప్రభుత్వం వ్యవసాయ నల్లచట్టాలని వెనక్కి తీసుకుంటానని ప్రకటించిందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేస్తానని ప్రకటించడంతో ఇప్పటివరకు 600 రోజులుగా విశాఖ నగరంలో రాష్ట్రవ్యాప్తంగా ఆ నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. నాలుగు నెలల నుంచి మణిపూర్ రాష్ట్రం తగలబడి పోతుందని, అది ఆరకముందే హర్యానా తగలబడిపోతుందన్నారు. దేశ ప్రజలపై మతతత్వ విధానాల్ని బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న పరిస్థితిని చూస్తున్నామన్నారు. ఇందుకు నిరసనగా దేశవ్యాప్తంగా ఈ నెల 9న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, ఒంగోలులో కూడా నిరసన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి మహేష్ పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమమే జగనన్న లక్ష్యం

మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

పేదవాని సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం త్రిపురాంతకం మండలంలోని నడిగడ్డ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, గ్రామస్తులు మంత్రి సురేష్‌పై పూలవర్షం కురిపించారు. సాదరంగా ఆహ్వానించారు. మంత్రి సురేష్ ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందించిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. సమస్యల పట్ల ఆరా తీశారు. ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత నాలుగేళ్ళ కాలంలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు వచ్చిన లబ్ధి వివరాలను మంత్రి సురేష్ కరపత్రాలలో చదివి వినిపిస్తూ పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. వాలంటీర్లు వచ్చి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి అర్హులకు వచ్చేలా సహకరిస్తున్నారా.. అంటూ అడిగి తెలుసుకున్నారు. ఇవి కాక గ్రామంలోని


మంత్రి సురేష్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొనేందుకు గడప గడపకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ కుల, మత, పార్టీ విభేదాలు లేకుండా అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పారదర్శక పాలన అందిస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ముందుగా ఆ గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించి సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. వైఎస్ఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, జడ్‌పిటిసి మాకం జాన్‌పాల్, వైసిపి మండల కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జీతాలు వెంటనే చెల్లించాలి

డిఇఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రేషనలైజేషన్, ప్రమోషన్, బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓవి వీరారెడ్డి, కె.రవి డిమాండ్ చేశారు. మూడు నెలలుగా ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించని కారణంగా వారు పడుతున్న ఇబ్బందులపై యుటిఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం సాయంత్రం ఒంగోలు డిఇఒ కార్యా లయం వద్ద ఉపా ధ్యాయులు నిరసన చేప ట్టారు. ఈ సంద ర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లా డుతూ జిల్లాలోని ఉపాధ్యాయులకు వెం టనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 3నెలలుగా ఎంఇఒ-2, పిజిటి, రేషనలైజేషన్, ప్రమోషన్ కారణంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు, హెచ్‌ఎం పోస్ట్ లేని ఉన్నత పాఠశాలల



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులు యుపి గ్రేడ్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, బదిలీలలో గాలిలో ఉన్న ఉపాధ్యాయులు, బ్లాక్ పోస్ట్‌లో పొజిషన్ ఇచ్చిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలన్నారు. లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, సహాధ్య క్షులు షేక్ అబ్దుల్ హై, సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-శింగరాయకొండ

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. జాబ్‌మేళాలో 15 బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికుటి అశోక్‌బాబు మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు కల్పించడం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని నియోజకవర్గాల్లో ప్రతినెలా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకూ చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏపీ టూరిజం జిల్లా అధికారి కె.బెన్హర్ మాట్లాడుతూ ప్రతినెలా ఎపిఎస్ఎస్ డిసి ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్ మాట్లాడుతూ ప్రతినెలా మొదటి శుక్రవారం ఏదో ఒక నియోజకవర్గ కేంద్రంలో జాబ్ మేళాలు ప్రతినెలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు 308 మంది హాజరు కాగా 132 మందిని ఎంపిక య్యారు. అనంతరం 35 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసి నియమామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి, ఆర్.లోకనాథం, నాయకులు ఢాకా పిచ్చిరెడ్డి, తన్నీరు సుబ్బారావు, షేక్ సలీంబాషా, ఎంపిడిఒ షేక్.జమీఉల్లా, ఎస్ఐ టి.శ్రీరాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్‌బాబు

సమస్యల సుడిలో గురుకుల పాఠశాల

- ఐదెకరాల్లో నిర్మించాల్సిన పాఠశాల 30 సెంట్లలో కొనసాగింపు
- బాలికలకు కాలకృత్యాలకూ తప్పని తిప్పలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని ఎపి గిరిజన బాలికల గురుకుల పాఠశాల సమస్యలతో కునారిల్లుతోంది. అసౌకర్యాల నడుమ అక్కడ బాలికలు చదువుకునేదెలాగని మదనపడుతున్నారు. క్రీడా ప్రాంగణం లేదు. తగినన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు లేవు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు అవస్థలు పడుతున్నారు అక్కడి బాలికలు. ఐదెకరాల్లో నిర్మించాల్సిన గురుకుల పాఠశాల 30 సెంట్ల స్థలంలోనే సంవత్సరాల తరబడీ కొనసాగుతోంది. మార్కాపురం డివిజన్‌లోని గిరిజన బాలికలకు మెరుగైన విద్యను అందించాలన్న లక్ష్యంతో 2016-17 విద్యా సంవత్సరంలో ఐటిడిఎ సహకారంతో


గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల

ఎపి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో మార్కాపురం పట్టణంలోని నాగులవరం రోడ్డులో కొనసాగుతున్న ఎస్టీ హాస్టల్ భవనంలో గురుకుల బాలికల పాఠశాలను నెలకొల్పారు. అప్పటి నుంచి గురుకుల పాఠశాల అక్కడే కొనసాగుతోంది. ప్రస్తుతం ఆ గురుకుల పాఠశాలలో 320 మంది బాలికలు 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకుంటున్నారు. కేవలం 30 సెంట్ల స్థలంలో నిర్మించిన భవనాల్లో వసతితో పాటు విద్యా బోధన జరుగుతోంది. కొద్దిపాటి స్థలంలో ఇరుకు గదుల్లో చదువులు కొనసాగించక తప్పడంలేదు. ఎపి గిరిజన బాలికల గురుకుల పాఠశాల కోసం మార్కాపురం మండలంలోని రాయవరం సమీపంలో ఐదెకరాల స్థలాన్ని ఎంపిక చేసినా... భవన నిర్మాణాలకు కార్యరూపం దాల్చకపోవడంతో అసౌకర్యాల నడుమ గిరిజన బాలికలు చదువులు కొనసాగిస్తున్నారు. మైదానం లేకపోవడంతో ఎప్పుడూ హాస్టల్ గదిలో లేదా తరగతి గదిలో ఉండాల్సి వస్తోందని బాలికలు వాపోతున్నారు. కనీస అవసరాలు తీర్చుకునేందుకు అవసరమైన మరుగుదొడ్లు కూడా లేవనే చెప్పాలి. 320 మంది బాలికలకు కేవలం 12 మరుగుదొడ్లు, 12 స్నానపు గదులు మాత్రమే ఉన్నాయి. కాలకృత్యాలు తీర్చుకునేందుకు తెల్లారక ముందు నుంచే వరుసక్రమంలో నిల్చోవాల్సి వస్తోందని బాలికలు వాపోతున్నారు.